## క్లుప్తంగా

### రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లు

**పులివెందుల టౌన్ :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో విద్యార్థిని, విద్యార్థులకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం రక్తగ్రూప్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. నగరిగుట్ట, భాకరాపురం పట్టణ ప్రాథమిక వైద్యశాల ల్యాబ్ టెక్నీషియన్‌లు సురేష్, సంపత్‌కుమార్, జగన్నాథ్ సహకారంతో పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ శ్రీనివాస్‌రెడ్డి సేవా సమితి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

**చెన్నూరు :** కడప కోటి రెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ – 1 ఆధ్వర్యంలో రామనపల్లిలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా ఐదవ రోజు సోమవారం రామనపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. మెడికల్ క్యాంపు ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీం బాషా మాట్లాడుతూ మెడికల్ క్యాంపులో డాక్టర్ నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారన్నారు. అనంతరం డాక్టర్ నారాయణ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలియజేశారు. మెడికల్ క్యాంపులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.వి జయలక్ష్మిదేవి, వలంటీర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు రఘునాథరెడ్డి, స్వరూప రాణి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### ఇళ్ల రిజిస్ట్రేషన్ పరిశీలన

**సింహాద్రిపురం :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నారు. వీటికి సంబంధించి లబ్ధిదారుల పేర్లపై రిజిస్టర్ చేసి పత్రాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మండల వ్యాప్తంగా సచివాలయాల పరిధిలోని 443 మంది లబ్ధిదారులతో సోమవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియను తహసీల్దార్ భీమేశ్వరరావు, డీటీ వెంకటరెడ్డి, ఆర్ఐ షేక్షాతో కలిసి పరిశీలించారు.

### ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు అవగాహన

**ముద్దనూరు :** వచ్చే ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండలంలోని తిమ్మాపురం, రాజులగురువాయిపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో ఎన్నికల సెక్టోరియల్ అధికారి వెంకట కృష్ణారెడ్డి, సీఐ దస్తగిరి ఓటర్లతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఓటు వేసే విధానం, ఈవీఎంల వినియోగం గురించి వివరించారు.


### అక్రమ మద్యం స్వాధీనం

**ముద్దనూరు :** స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలో సోమవారం అక్రమంగా మద్యం సీసాలు కలిగివున్న ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. కొర్రపాడు గ్రామానికి చెందిన మహిళ నుంచి 10 బీరు బాటిళ్లు, మరో 20 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

### వీఆర్ఏ మృతి

**వీరపునాయునిపల్లె :** మండలంలోని యు.వెంకటాపురం వీఆర్ఏ సయ్యద్ ఖాజా వలి సోమవారం రాత్రి మృతి చెందాడు. ఇతను గత 30 సంవత్సరాలుగా వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొన్ని నెలలుగా పక్షవాతం వ్యాధితో బాధపడుతూ సోమవారం స్వగ్రామమైన ఉరుటూరులోని ఆయన తుది శ్వాస విడిచాడు. విషయం తెలుసుకొన్న డీటీ రాజేష్ కృష్ణ మంగవారం ఖాజావలి మృతదేహానికి నివాళి అర్పించారు. వీఆర్ఓ దొరబాబు, వీఆర్ఏలు వెంకటసుబ్బయ్య, కొమ్మద్ది ఈశ్వరయ్య, శంకర్, గోపాల్, గ్రామస్థులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

### ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ కంపెనీ డీజీఎం మృతి



నాగరాజు మృతదేహం

**పులివెందుల రూరల్ :** పులివెందుల పట్టణంలోని ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ కంపెనీ డీజీఎమ్ నాగరాజు (48)సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం రాత్రి 2 గంటల ప్రాంతంలో ఛాతి నొప్పి రావడంతో చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించి ఆరోగ్యం బాగ ఉందని చెప్పారు. దీంతో నాగరాజు కంపెనీకి వెళ్లారు. మళ్లీ ఛాతిలో నొప్పి రావడంతో చికిత్స కోసం మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్సలు చేస్తుండగానే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహరరెడ్డిలు ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

# అభివృద్ధి, సంక్షేమమే జగనన్న ధ్యేయం



రామిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



బైపాస్ రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

- రూ.9.60 కోట్ల ప్రగతి పనులు ప్రారంభం
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

**వేంపల్లె :** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో రూ.9.60 కోట్లతో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి, బైపాస్ రోడ్డు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పాడా ఓస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, డీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తిరుపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీటీసీ చంద్ర ఓబుల్‌రెడ్డి తన సొంత స్థలంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన చేస్తున్నారన్నారు. ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పాలనను భ్రష్టు పట్టించారన్నారు. ప్రస్తుతం టీడీపీ నేతలు వలంటీర్ల వ్యవస్థపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కులమతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన పేదలకు అందాలనే లక్ష్యంతో వలంటీర్ల వ్యవస్థను తీసుక రావడం జరిగిందన్నారు. గ్రామాలలో ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలన్న ఆశయంతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు. గత టీడీపీ హయాంలో రైతులకు గిట్టుబాటు ధర లేక, దిగుబడి రాక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర కల్పిస్తూ, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పంటల బీమా, సబ్సిడీ తదితరాలు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఉనికి కాపాడుకునేందుకు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. ఆ పార్టీల కుట్రలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్లు చంద్ర ఓబుల్‌రెడ్డి, సాంబశివారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఏడు యల్లారెడ్డి, శ్రీనివాసులు, రాంప్రసాద్‌రెడ్డి, కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, ఈఈ సిద్దారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రామలింగారెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబులరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# మళ్లీ వైఎస్సార్‌సీపీకి పట్టం కడదాం



ప్రజలకు పథకాలను వివరిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

**పులివెందుల టౌన్ :** ప్రజల మంచి కోరే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని.. కావున ఆ పార్టీకి మళ్లీ పట్టం కట్టాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఉలిమెల్ల వార్డు సచివాలయ పరిధిలోని ఉలిమెల్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజుల్లా, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డితో కలిసి.. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ఎంత లబ్ధి పొందారో ప్రజలకు తెలిపారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై వివరించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే రావాలన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతం, గ్రామం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా రావాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిషోర్, చంద్రమౌళి, కౌన్సిలర్ కోడి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# యువతకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

**జమ్మలమడుగు రూరల్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, దాల్మియా భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతి, యువకులకు నైపుణ్యాభివృద్ధిపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె. సురేంద్రనాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి, ఐటిఐ, డిప్లొమో విద్యార్థులు అర్హులన్నారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. కోర్సు కాల వ్యవధి 2 నెలల నుండి 3 నెలల వరకు ఉంటుందన్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు పాస్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం గుర్తింపు పొందిన సర్టిఫికేట్లు అందించి వారికి ఉద్యోగ అవకాశలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9182819870, 9502609641 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# వైభవంగా ఆరాధన మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో తిమ్మగురు స్వామి

**చింతకొమ్మదిన్నె :** మండలంలోని బుగ్గలేటిపల్లెలో సజీవ సమాధి అయిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శిష్యుడైన తిమ్మ గురుస్వామి ఆరాధన మహోత్సవాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమంతోపాటు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. రాత్రి స్వామి వారి ఊరేగింపులో భాగంగా కోలాటం , సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

# బస్ షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎర్రగుంట్ల :** పట్టణంలోని మెయిన్ బజార్‌లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా ఆర్టీసీ బస్సుల నిలుపుదల కోసం నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. బస్ షెల్టర్‌ను పుల్లగూర చిన్న గోవిందప్ప, సుభద్రమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిర్మించారు. ప్రయాణికులకు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**కొండాపురం :** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రొద్దుటూరు డిప్యూటి ఎడ్యుకేషన్ అధికారి జి. క్రిష్ణప్ప అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చౌటిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సబ్జెక్టుల వారిగా ఏ విధంగా ఉపాధ్యాయులు బోధిస్తున్నారో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐపిలో భాగంగా ఉపాధ్యాయుల కమిటీ సభ్యులు సైన్సుకు సుబ్బరాయుడు, గణితంకు నరసింహారెడ్డి, సోషియల్‌కు వెంకట్, తెలుగుకు గంగాధర్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యాభోధనపై అవగాహన కల్పించారు. అలాగే అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పద వతరగతి విద్యార్థునులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఓబులేసు, రామయ్య పాల్గొన్నారు.

# డీఎస్సీ పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న పీడీయస్ నాయకులు

**వేంపల్లె :** రాష్ట్రంలో డీఎస్సీ పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని పీడీయస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. సోమవారం పీడీయస్ ఆధ్వర్యంలో వేంపల్లె పట్టణంలోని అక్షర బాలికల కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 ఏళ్ల నుంచి ఊరిస్తూ కేవలం 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థుల ఆవేదనను దృష్టిలో ఉంచుకుని నోటిఫికేషన్ నాటికి జూన్ వరకు.. రిటైర్డు అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇందులో చేర్చి పోస్టుల సంఖ్య పెంచాలన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన అధికారులు

**కమలాపురం :** మండల తహసీల్దార్‌గా ఐ.సుబ్రమణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా వడమాలపేట తహసీల్దార్‌గా ఉన్న సుబ్రమణ్యం ఎన్నికల బదిలీల్లో భాగంగా కమలాపురానికి వచ్చారు. సిబ్బందితో కలసి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. అంతకు ముందు పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సమావేశంలో డీటీలు అహల్య, నరేంద్ర, శ్రీకాంత్, ఆర్ఐలు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

**వీరపునాయునిపల్లెలో..**

**వీరపునాయునిపల్లె :** మండల తహసీల్దార్‌గా అమర్‌నాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు జిల్లా గన్నవరం మండలం తహసీల్దార్‌గా నిర్వహిస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా వీరపునాయునిపల్లెకు వచ్చారు.

ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సిబ్బంది సహాయ సహకారాలతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.

**పెండ్లిమర్రి తహసీల్దార్‌గా చంద్రశేఖర్ వర్మ**

**పెండ్లిమర్రి :** మండల తహసీల్దార్‌గా చంద్రశేఖర్ వర్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఉన్న తహసీల్దార్‌లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. కర్నూల్ జిల్లా పనిచేస్తున్న చంద్రశేఖర్ వర్మను పెండ్లిమర్రి మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

**చింతకొమ్మదిన్నె తహసీల్దార్‌గా కేపీ భాగ్యలక్ష్మి**

**చింతకొమ్మదిన్నె :** మండల నూతన తహసీల్దార్‌గా కేపీ భాగ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో తిరుపతి జిల్లా పాకాల మండలంలో పనిచేస్తూ ఎన్నికల బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

**ఎర్రగుంట్ల తహసీల్దార్‌గా సౌజన్యలక్ష్మి**

**ఎర్రగుంట్ల :** మండల తహసీల్దార్‌గా సౌజన్య లక్ష్మీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా పరిగి మండలం నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను సక్రమంగా నిర్వర్తించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

**కొండాపురం తహసీల్దార్‌గా శ్రీనివాసులు**

**కొండాపురం:** మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శోభన్‌బాబు అనంతపురం జిల్లా శింగనమలకు బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా ములకల చెరువు తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు ఇక్కడికి బదిలీపై వచ్చారు

**ముద్దనూరు తహశీల్దారుగా శ్రీనివాసులు**

**ముద్దనూరు:** మండల తహసీల్దారుగా బి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు వెంకటేశ్వర్లు బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లారు. నంద్యాల జిల్లా నుంచి శ్రీనివాసులు బదిలీపై ఇక్కడ విధుల్లో చేరారు.

# వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- సమస్యలను పరిష్కంచాలని కౌన్సిలర్లు డిమాండ్
- అధికారుల అలసత్యంపై మండిపాటు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. సోమవారం మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు అధికారుల అలసత్యంపై మండిపడ్డారు. ప్రతి సమావేశంలో అధికారులు వారికి కావాల్సిన బిల్లులు కోసం అజెండాను సిద్ధం చేసి మా సంతకాల కోసం మాత్రమే సమావేశం పెడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ వాహనాలకు డీజిల్ కోసం దొంగ బిల్లులను అధికారులు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. నిధులు వస్తున్నా.. వాటిని ఎక్కడ ఖర్చు చేస్తున్నారో వివరాలు తెలియజేయాలని కోరారు. వార్డులలో కౌన్సిలర్లు అడిగిన పనులు ఏ ఒక్కటి జరగలేదన్నారు. తర్వాత బడ్జెట్‌పై చర్చించారు. అనంతరం అదనపు అజెండాలోని అంశాలపై చర్చించారు. మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కౌన్సిలర్లు అభీష్టం మేరకే వారి సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అజెండాలోని అంశాలపై కౌన్సిలర్లుతో చర్చించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు జైబున్నీసా, చంద్రకళ, కమిషనర్ రామక్రిష్ణలతో పాటు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**మున్సిపల్ అధికారుల తీరుతో అన్యాయం**

'మున్సిపల్ అధికారుల తీరుతో మాకు అన్యాయం జరిగింది. దీనిపై కౌన్సిల్ సమావేశంలో నిలదీశాం. మేం ఎప్పుడూ వైఎస్సార్‌సీపీ విధేయులమే. అధికారుల తప్పిదాల వల్లనే రాజీనామా చేయాలనుకొన్నాం. మళ్లీ మా ఆలోచనను విరమించుకున్నామని' మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రకళ, కౌన్సిలర్లు థెరిసా, భాస్కర్, మహమ్మద్‌ఆలీ, పార్టీ నాయకులు వర్రా డెవిడ్, ప్రశాంత్ తెలిపారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డితో కలసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు కౌన్సిలర్లకు కనీస మర్యాద, విలువ ఇవ్వకుండా చూస్తున్నారన్నారు. మా వార్డులో పనులు చేయాలని కోరితే పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చొరవతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎమ్మెల్యేతోనే కలసి పనిచేస్తామని ఆయన గెలుపే మా లక్ష్యమన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని ప్రలోభాలు గురిచేసినా తలవంచే ప్రసక్తే లేదన్నారు. మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మాలో విభేదాలు లేవన్నారు. అందరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పని చేస్తామన్నారు. కొందరు కౌన్సిలర్లు వారి బాధలను చెప్పుకున్నారు. వాటిని పరిష్కరించామన్నారు.

### నేడు మండల సమావేశం

**చెన్నూరు :** చెన్నూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండల సమావేశంలో వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ తెలియజేశారు.

### కడప రూరల్ సీఐగా నాగరాజు

**పెండ్లిమర్రి :** కడప రూరల్ సీఐగా నాగరాజు సోమవారం పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌లో సీఐ స్థాయి అధికారి అందుబాటులో ఉండే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలపై దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే స్టేషన్‌కు వచ్చి నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# శనగ పంటలో సస్యరక్షణ చేపట్టండి



గొల్లపల్లె వద్ద శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

**కమలాపురం :** శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గొల్లపల్లెలో సాగు చేసిన శనగ పంటను పరిశీలించారు. శనగ పంటకు తుప్పు తెగులు ఆశించిందన్నారు. దీనివల్ల దిగుబడి, గింజ నాణ్యత తగ్గుతుందన్నారు. నివారణకు లీటర్ నీటికి ప్రొఫి కొనజోల్ 1మి.లీ. లేదా హెక్సా కోనజోల్ 2 మి. లీ. కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించందన్నారు. నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏ మహేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో మొదటి స్థానం



విద్యార్థి మధుసూధన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అమల్‌రాజ్

**పులివెందుల టౌన్ :** స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం విద్యార్థి మధుసూధన్ రాష్ట్రస్థాయి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో మొదటి బహుమతి అందుకున్నారు. సోమవారం కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్ విద్యార్థికి సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఇటీవల మదనపల్లెలోని బీటీ కళాశాలలో నిర్వహించిన నృత్య ప్రదర్శనల పోటీలలో భరతనాట్యం ప్రత్యేక విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రావడం జరిగిందని ప్రిన్సిపల్ అమల్‌రాజ్ తెలిపారు.

# వైఎస్సార్‌సీపీ పాలనలోనే అన్ని వర్గాలకు ప్రయోజనాలు



పెండ్లిమర్రి: చెర్లోపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య



వల్లూరు: గోటూరులో ప్రచారం చేస్తున్న నేతలు

**వల్లూరు :** సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌సీపీ పాలనలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనాలు కలుగుతున్నాయని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గోటూరు గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ నేతలతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. వైఎస్ జగన్‌ను రెండవ సారి సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట సుబ్బయ్య, ఎంపీటీసీ రామ క్రిష్ణారెడ్డి, పార్టీ నేతలు శివకుమార్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి, పుత్తా రాజేంద్రారెడ్డి, మోపూరి నాగ సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, గోసుల శివారెడ్డి, నిత్యానందరెడ్డి, క్రిష్ణమూర్తి యాదవ్, చంద్రా యాదవ్, రాజా, ఇందిరెడ్డి శంకర్ రెడ్డి, నాగ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రాభివృద్ధి కోసం జగనన్న మళ్లీ సీఎం కావాలి**

**చింతకొమ్మదిన్నె :** రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందని వైఎస్ఆర్‌సీపీ నాయకులు 16వ డివిజన్ ఇన్చార్జి నాగిరెడ్డి ప్రసాద్ రెడ్డి, బూత్ కన్వీనర్ కానగల సుబ్బరామయ్యలు అన్నారు. సోమవారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని 16 డివిజన్ ఆర్ పి ఎస్ కాలనీ, మామిళ్లపల్లెలో ఇంటింటికి వెళ్లి పథకాల గురించి ప్రజలకు వివరించి వైఎస్ జగన్‌ను రెండవసారి ముఖ్యమంత్రిగా గెలిపించవలసిందిగా ప్రజలకు చెబుతూ ప్రచారం చేశారు. ఇందుకు ఆర్ పి ఎస్ కాలనీ ప్రజలు సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిని మెజారిటీతో గెలిపిస్తామని ప్రసాద్‌రెడ్డి తో ప్రజలందరూ చెప్పడం జరిగింది. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహ సారథులు, ఆర్‌పీఎస్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

**పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు**

**పెండ్లిమర్రి :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందిస్తున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని పెండ్లిమర్రి, చెర్లోపల్లె, నంది మండలం గ్రామ పంచాయితీల్లో రెండు టీమ్‌లుగా ఏర్పడి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికలల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథరెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నాగపుల్లారెడ్డి, సిద్దారెడ్డి, ఓబుల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నాగమల్లారెడ్డి, బాబు, ధనుంజయరెడ్డి, సురేష్, రవి, వెంకటయ్య పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నె: ప్రచారం చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు